క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భూపాలపల్లి రూరల్: పట్టణంలోని రాంనగర్ 11 కేవీ ఫీడర్‌పై మరమ్మతులు, అదేవిధంగా బస్టాండ్ సమీపంలో కొత్త లైన్ ఏర్పాటు చేస్తున్నందున నేడు (ఆదివారం) ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని పట్టణ ఏఈ విశ్వాస్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సుభాష్ కాలనీ, రాంనగర్, ఎల్‌బీ నగర్, లక్ష్మీనగర్, బస్టాండ్ ఏరియా పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

కారు, బైక్ ఢీ.. ఒకరికి తీవ్రగాయాలు

భూపాలపల్లి రూరల్ : కారు, బైక్ ఢీకొని ఒకరికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని కమలాపూర్ క్రాస్‌రోడ్ వద్ద శనివారం రాత్రి చోటు చేసుకుంది. ప్రయాణికుల కథనం ప్రకారం.. మహాముత్తారం మండలం బోర్లగూడెం గ్రామానికి చెందిన జనార్దన్ భూపాలపల్లి నుంచి తన భార్య కుమారుడితో బైక్‌పై బోర్లగూడెం వెళ్తున్నాడు. ఈ క్రమంలో కమలాపూర్ క్రాస్‌వద్ద కాటారం నుంచి భూపాలపల్లికి వస్తున్న కారు జనార్దన్ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్ కిందపడగా జనార్దన్ తలకు, కాలికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే జనార్దన్‌ను 108 వాహనంలో ప్రయాణికులు జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన వాహనం..



భూపాలపల్లి అర్బన్: ఆగి ఉన్న లారీని తార్ ఢీకొట్టగా ముగ్గురు గాయపడిన ఘటన శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి నుంచి మంజూర్‌నగర్ వైపు వెళ్తున్న క్రమంలో సన్‌వ్యాలీ స్కూల్ ఎదురుగా ప్రధాన రహదారిపై ఆగి ఉన్న లారీని తార్ వాహనం ఢీ కొట్టడంతో వాహనం నుజ్జు నుజ్జయింది. దీంతో తార్‌లో ప్రయాణిస్తున్న రామప్ప కాలనీకి చెందిన సింగరేణి కార్మికుడు శేషు, అతని భార్య మానస, కూతురు అనూషకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని బయటకు తీసి 108 వాహనంలో సింగరేణి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు ఆస్పత్రికి తరలించినట్లు తెలిసింది.

పరామర్శ



మల్హర్ : మండలంలోని రుద్రారం గ్రామానికి చెందిన పోషక్క, సమ్మక్కలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. కాగా వారి కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు శనివారం పరామర్శించారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపి, చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

చల్లగరిగలో..



చిట్యాల : మండలంలోని చల్లగరిగ గ్రామానికి చెందిన దూదిపాల రాజిరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మాజీ జెడ్పీటీసీ గొర్రె సాగర్, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పిట్ట సురేష్ శనివారం మృతుడి చిత్రపటం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మండల ప్రధాన కార్యదర్శి ఏరుకొండ రాజేందర్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ దామెర రాజు, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, కుమార్ ఉన్నారు.

చెలరేగిన మంటలు

- మంటలను ఆర్పిన పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు



వాజేడు : మండల పరిధిలోని మొరుమూరు సమీప పంట పొలాల్లో శనివారం గుర్తు తెలియని వ్యక్తులు మంట పెట్టడంతో అది కాస్తా కార్చిచ్చుగా మారి గ్రామం వైపునకు దూసుకెళ్లింది. మంటలు చెలరేగుతున్న విషయాన్ని గమనించిన గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శి కార్తీక్‌కు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది గ్రామపంచాయతీ ట్యాంకర్‌లో నీటిని తీసుకుకొచ్చారు. అటవీశాఖకు చెందిన ఇద్దరు సిబ్బంది బ్లోయర్లతో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. యువకులు, గ్రామస్తులు మంటలను గ్రామంలోకి రాకుండా నిలువరించారు. తహసీల్దార్, డీటీ సత్యనారాయణ అక్కడికి చేరుకుని పరిశీలించారు.

అసంపూర్తి రోడ్లతో ఇబ్బందులు



గుంతలమయంగా మారిన రహదారి



కల్వర్టు వద్ద అసంపూర్తిగా ఉన్న మట్టి రోడ్డు

- శిథిలమైన కల్వర్టులు
- వాహనదారులకు తప్పని తిప్పలు

టేకుమట్ల : రవాణా సౌకర్యం మెరుగుపర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించడంతో మండలంలోని గర్మిళ్లపల్లి నుంచి చిట్యాల వరకు డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. కానీ వర్షాకాలంలో శిథిలమైన కల్వర్టుల వద్ద వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కోవడంతో మూడేళ్ల క్రితం గర్మిళ్లపల్లి నుంచి టేకుమట్ల వరకు మూడు కల్వర్టుల్లో వెలిశాల, టేకుమట్ల చెరువు మత్తడి వద్ద ఒక్కో కల్వర్టుకు సుమారు రూ. 2 కోట్ల నిధులతో నిర్మించారు. అలాగే గర్మిళ్లపల్లి శివారు వద్ద రూ.75 లక్షలతో లోలెవల్ కల్వర్టును నిర్మించారు. దాంతో రవాణా సౌకర్యం మెరుగుపడింది.

కల్వర్టుల వద్ద నిలిచిన రోడ్డు నిర్మాణం..

టేకుమట్ల , వెలిశాల చెరువుల మత్తడి వద్ద నిర్మించిన హైలెవల్ కల్వర్టులకు ఇరువైపులా బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడంతో వాహనదారులకు మళ్లీ ఇబ్బందులు మొదలయ్యాయి. రెండు కల్వర్టుల వద్ద ఇరువైపులా గుంతలు పడడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మూడేళ్లుగా కల్వర్టుల వద్ద రోడ్డు నిర్మాణానికి నిధులు లేకపోవడంతో పనులు నిలిచిపోయాయి. కల్వర్టుల వద్ద ద్విచక్రవాహనదారులు పడిపోయిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. అక్కడి నుంచి వెళ్లాలంటే భయపడుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు, పాలకులు స్పందించి కల్వ ర్టుల వద్ద ఇరువైపులా రోడ్డు నిర్మాణాన్ని చేపట్టాలని మండల ప్రజలు వేడుకుంటున్నారు.

కల్వర్టుల వద్ద భయమేస్తుంది



ఆటోలో ప్రయాణికులను తీసుకొస్తున్న క్రమంలో వెలిశాల, టేకుమట్ల కల్వర్టు వద్దకు చేరుకోగానే భయమేస్తుంది. కల్వర్టుల వద్ద ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదం జరుగుతుంది. సంపాదించిన సొమ్మును మరమ్మతులకే పెట్టాల్సి వస్తుంది. కల్వర్టుల వద్ద రోడ్డు నిర్మాణం చేపట్టాలి.

– గీద భాస్కర్, ఆటో డ్రైవర్ రాఘవాపూర్

ఇబ్బంది పడుతున్నాం..



కల్వర్టుల వద్ద రోడ్డు సరిగా లేకపోవడంతో ట్రాలీ లోడ్‌తో వెళ్తున్న సమయంలో కమాన్ పట్టాలు విరిగిపోతాయనే భయం వేస్తుంది. రోడ్డు మొత్తం బాగానే ఉంది. కేవలం కల్వర్టుల వద్ద నిర్మాణం చేపడితే వాహనాలకు ఏ ఇబ్బంది ఉండదు. లోడ్‌తో వెళ్తున్న ప్రతీసారి వాహనానికి ఏమౌతుందోనని ఆందోళన చెందుతున్నాం.

– ఈర్ల సతీష్, ట్రాలీ డ్రైవర్. రామకిష్టాపూర్(వి)

దామెరకుంటలో ఉచిత వైద్యశిబిరం



కాటారం: పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కాటారం : మండలంలోని దామెరకుంటలో కరీంనగర్ మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో శనివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో 130 మందికి ఆస్పత్రి వైద్యుడు దీక్షిత్ పరీక్షలు నిర్వహించినట్లు ఆస్పత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ తెలిపారు. రోగులకు షుగర్, బీపీ, 2డీ ఎకో పరీక్షలు చేసి రోగ నిర్ధారణ చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ మారుమూల గ్రామీణ ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందించాలనే ఉద్దేశంతో మెగా వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మెడికవర్ ఆస్పత్రిలో 24 గంటల పాటు అన్ని రకాల సేవలు అందుబాటులో ఉంటాయని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. మాజీ సర్పంచ్ బాసాని రఘువీర్, మెడికవర్ మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, బొంగోని హరీశ్, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

మైనార్టీ కళాశాలలో వైద్యశిబిరం

వెంకటాపురం(ఎం): మండల కేంద్రంలోని మైనార్టీ జూనియర్ కళాశాలలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో కళాశాల విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించినట్లు పీహెచ్‌సీ వైద్యురాలు రిషిత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలికలు ఆరోగ్యంపై ఆందోళనకు గురి కావొద్దని, పరీక్షల సమయంలో మానసిక ధృడత్వాన్ని కలిగి ఉండాలని సూచించారు. విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. అనారోగ్య సమస్యలు ఎదురైతే స్థానిక వైద్యసిబ్బందిని వెంటనే సంప్రదించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ కళాశాల ప్రిన్సిపాల్ వందన, ఏఎన్‌ఎంలు అనురాధ, స్వప్న, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థికి ప్రోత్సాహక బహుమతి

మల్హర్: గాంధీ సొసైటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయిలో శనివారం నిర్వహించిన ఆన్‌లైన్ ఉపన్యాస పోటీల్లో మండలంలోని తాడిచర్లకు చెందిన విద్యార్థి ఇందారపు సాత్విక్ ప్రోత్సాహక బహుమతి అందుకున్నాడు. రూ. 10వేల నగదును సొసైటీ వారు అందించారు. అలాగే గతంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఉపన్యాస పోటీలో పాల్గొని తృతీయ బహుమతి సాధించాడు. పెద్దపల్లి జిల్లా మంథని మండలం సూర్యపల్లి గ్రామంలోని మేరీ మీడియా ట్రిక్స్ పాఠశాలలో సాత్విక్ పదో తరగతి చదువుతున్నాడు.పాఠశాల యాజమాన్యం, తల్లిదండ్రులు, గ్రామస్తులు విద్యార్థిని అభినందించారు.

ఎమ్మెల్యేను కలిసిన ప్రెస్‌క్లబ్ కమిటీ



ఎమ్మెల్యేను సన్మానిస్తున ప్రెస్‌క్లబ్ సభ్యులు

చిట్యాల : భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావును శనివారం సాయంత్రం చిట్యాల ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బొకే అందించి శాలువాతో సన్మానించారు. అనంతరం నూతన ప్రెస్‌క్లబ్ కమిటీకి ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కట్కూరి మొగిలి, ప్రధాన కార్యదర్శి గజనాల మహేందర్, ఉపాధ్యక్షుడు చింతల మహేందర్, సహాయ కార్యదర్శి సామల ధనుంజయ, కోశాధికారి బుర్ర చక్రపాణి, కార్యవర్గ సభ్యులు ఉన్నారు.

ఎమ్మెల్సీగా గెలిపించాలని ప్రచారం



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న చైర్మన్, కాంగ్రెస్ నాయకులు

కాటారం : కాటారం, మహాముత్తారం మండలాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాశ్‌రెడ్డి పర్యటించి ఉపాధ్యాయులు, పట్టభద్రులను కలిశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు. మహాముత్తారం మండలం బోర్లగూడెంలో మండల అధ్యక్షుడు పక్కల సడ్వలి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోట రాజబాబు, పీఏసీఎస్ చైర్మన్ తోటపల్లి ప్రశాంత్, నాయకులు దేవేందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో..

కాటారంలో బీజేపీ నాయకులు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులు, పలు పాఠశాలల్లోని ప్రభుత్వ ఉపాధ్యాయులను కలిసి బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ అంజిరెడ్డి చిన్నమైల్‌కి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. జిల్లా కౌన్సిల్ మెంబర్ భాస్కర్‌రెడ్డి, మండల కో కన్వీనర్ మల్లారెడ్డి, శ్రీశైలం, సునీల్, రవి, సదానందం పాల్గొన్నారు.

‘జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి’

ములుగు : జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని టీడబ్ల్యూజేఎఫ్ జాతీయ కౌన్సిల్ సభ్యుడు, ములుగు ప్రెస్‌క్లబ్ మాజీ అధ్యక్షుడు పిట్టల మధుసూదన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవచూపాలని కోరారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇళ్ల స్థలాలతో పాటు ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న జర్నలిస్టులకు ప్రభుత్వం తగిన సాయం అందించాలని వివరించారు. మహిళా జర్నలిస్టులకు రాత్రిపూట ప్రత్యేక రవాణా సదుపాయాలు కల్పించాలని, రిటైర్డ్ జర్నలిస్టులకు పెన్షన్ పథకాన్ని అమలు చేయాలని కోరారు. సమస్యల పరిష్కారానికి 24వ తేదీన కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు జర్నలిస్టులు హాజరుకావాలన్నారు.

షీ టీంలతో మహిళలకు భద్రత

- ఎస్సై మౌనిక



అవగాహన కల్పిస్తున్న ఎస్సై మౌనిక

ములుగు: షీ టీంలతో జిల్లాలోని మహిళలు, బాలికలకు భద్రతతో పాటు భరోసా కల్పిస్తున్నట్లు ఎస్సై మౌనిక అన్నారు. ఎస్పీ డాక్టర్ శబరీష్ ఆదేశాల మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని మండల సమాఖ్య కార్యాలయంలోని మహిళలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మహిళలు, బాలికల రక్షణకు ప్రత్యేక షీ టీంను ఏర్పాటు చేశామని ఎక్కడైనా వేధింపులు ఎదురైనా వెంటనే జిల్లా షీ టీం నంబర్ 8712670115 లేదా 100కు డయల్ చేసి వివరాలు తెలిపితే వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని బాధితురాలి ఫిర్యాదు మేరకు ఆకతాయిలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. అనంతరం పోక్సో చట్టం, బాల్యవివాహాలు, ఈవ్‌టీజింగ్, గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించారు. సమాజంలో జరుగుతున్న నేరాలు వాటి ఏ విధంగా రక్షణ పొందాలి అంశాలపై వివరించారు.

ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలి



వలస కూలీలకు పరీక్ష చేస్తున్న కిషన్

ములుగు రూరల్: ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వైజీఆర్ కేర్ లింక్ వర్కర్ కిషన్ అన్నారు. శనివారం మండలంలోని జాకారం సమీపంలోని పత్తి మిల్లుల వద్ద వలస కూలీలకు తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపు నిర్వహించి హెచ్‌ఐవీ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి నాలుగు రకాలుగా సంక్రమిస్తుందని అన్నారు. సురక్షితం కాని లైంగిక సంబంధాలు, కలుషిత ఇంజక్షన్ల ద్వారా, పరీక్షించని రక్తమార్పిడి, హెచ్‌ఐవీ గర్భిణి నుంచి పుట్టబోయే బిడ్డకు సంక్రమిస్తుందని తెలిపారు. హెచ్‌ఐవీ రోగులను ప్రేమతో ఆదరించాలని వారిపై ఎలాంటి వివక్ష చూపకూడదని తెలిపారు. పేషెంట్లకు ఏఆర్‌టీ మందులు జీవితకాలాన్ని పెంచుతాయని అన్నారు. ఐసీటీసీ కౌన్సిలర్ కుమార్‌సింగ్ పాల్గొన్నారు.

‘విద్యుత్ తీగల కింద నిర్మాణాలొద్దు’

ఏటూరునాగారం: ఏటూరునాగారం, కన్నాయిగూడెం, కమలాపురం ప్రాంతాల్లోని ప్రజలు కరెంటు తీగల కింద భవనాలు, ఎత్తయిన కట్టడాలను నిర్మించవద్దని విద్యుత్‌శాఖ ఏడీఈ సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగా నిర్మించే ప్రజలు 33 కేవీ లైన్‌కు 2 మీటర్ల దూరంలో, 11 కేవీ లైన్‌కు 1.2 మీటర్ల దూరంలో, ఎల్‌టీలైన్‌కు 1.2 మీటర్ల దూరంలో నిర్మించుకోవాలని సూచించారు. 33 కేవీలైన్ 11 కేవీ లైన్ ఎల్‌టీ లైన్‌కు 3.7 మీటర్ల క్లియరెన్స్‌గా ఉన్న తర్వాతనే భవనాలు నిర్మించుకో వాలన్నారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తే వారిపై శాఖ పరమైన చర్యలు ఉంటాయన్నారు. ప్రమాదా ల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. విద్యుత్ సరఫరా, ఇతర ఏ సమస్యలైనా అధికారులు, సిబ్బందికి సమాచారం ఇచ్చి పరిష్కరించుకోవాలన్నారు. ఏఈ అశోక్ 9440814867, ఏఈ కన్నాయిగూడెం స్వామి 7901678232, ఏఈ కమలాపురం సుబ్బారాంశర్మ 9440814941లకు సంప్రదించాలన్నారు.

గురుకుల ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

రేగొండ : ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకులాల్లో ఐదో తరగతి ప్రవేశాలకు నేడు (ఆదివారం) జరిగే పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు లింగాల మహాత్మా జ్యోతి బాపూలే గురుకుల ప్రిన్సిపాల్ విజయ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష ఉంటుందని వెల్లడించారు. http://tgswreis.telangana.gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్‌తో నిర్ణీత సమయానికి హాజరుకావాలని, హాల్‌టికెట్‌పై తప్పులుంటే ఇన్విజిలేటర్‌కు చెప్పి తగిన పత్రాలు సమర్పించి సరిచేసుకోవాలని సూచించారు. లింగాలలో 238 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారని తెలిపారు. ఆలస్యమైనా వారికి పరీక్ష కేంద్రంలోకి అనుమతించబడదని పేర్కొన్నారు.

నేడు ప్రవేశ పరీక్ష..

కాటారం: ప్రభుత్వ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశం, 6 నుంచి 9వ తరగతి వరకు బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీ కోసం నేడు (ఆదివారం) టీజీ సెట్ నిర్వహించనున్నారు. మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర, బాలికల గురుకుల పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు గిరిజన గురుకులాల జిల్లా సమన్వయకర్త, కాటారం ప్రిన్సిపాల్ రాజేందర్ తెలిపారు. బాలుర పాఠశాలలో 480 మంది, బాలికల పాఠశాలలో 360 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

అడవుల రక్షణ అందరి బాధ్యత



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ అధికారులు

కాటారం : అడవుల రక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యతగా భావించి ఎలాంటి హాని కలుగకుండా చూసుకోవాలని కాటారం డిప్యూటీ రేంజ్ అధికారి సురేందర్ తెలిపారు. మండలంలోని గుమ్మళ్లపల్లి, ఆదివారంపేట గ్రామాల్లో శనివారం గ్రామస్తులకు అడవుల సంరక్షణ, అగ్ని ప్రమాదాల నివారణ, పులి కదలికలపై అటవీశాఖ అధికారులు అవగాహన కల్పించారు. అటవీ చట్టాలు, వన్యప్రాణాలను వధిస్తే వర్తించే చట్టాలను వివరించారు. ఈ సందర్భంగా సురేందర్ మాట్లాడుతూ.. అడవులు విస్తారంగా ఉంటేనే సమయానికి వర్షాలు కురుస్తాయని పర్యావరణం అనుకూలంగా ఉంటుందన్నారు. వేసవి కాలంలో అడవుల్లో అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అడవుల్లో మంటలు అంటిస్తే కఠిన చర్యలు తప్పవని, మంటలు వ్యాపించడం గమనిస్తే వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఉచ్చులు, కరెంట్ తీగలు లాంటివి అమర్చి వన్యప్రాణులను వధిస్తే కేసులు నమోదు చేసి జైలుకు పంపించడం జరుగుతుందని హెచ్చరించారు. అడవుల్లో పులి సంచరిస్తున్నట్లు ఆనవాళ్లు ఉన్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాత్రి పూట అటవీ ప్రాంతంలోకి వెళ్లొద్దని సూచించారు. కార్యక్రమంలో యామన్‌పల్లి డీఆర్‌ఓ శ్రీనివాస్, దామెరకుంట ఎఫ్‌ఎస్‌ఓ చంద్రశేఖర్, ఏఫ్‌బీఓలు అశోక్, సంజీవ్, మోయినొద్దీన్, రాజ్‌కుమార్, మోనకౌసర్, జయలక్ష్మి, రాజేందర్, బేస్ క్యాంపు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణులను సంరక్షించుకోవాలి



మాట్లాడుతున్న రేంజర్ రవికుమార్

కాళేశ్వరం : మహదేవపూర్ అటవీశాఖ కార్యాలయంలో మహదేవపూర్, పలిమెల, పెగడపల్లి రేంజ్‌ల అధికారులు అటవీశాఖ సిబ్బందితో వన్యప్రాణులను సంరక్షించుకోవాలని శనివారం అవగాహన సమావేశం నిర్వహించారు. వేసవి సమీపిస్తుండడంతో నీటివసతి, అగ్ని నిరోధక చర్యలపై సిబ్బందికి వివరించారు. సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో మహదేవపూర్, పలిమెల, పెగడపల్లి రేంజ్ అధికారులు రవికుమార్, నాగరాజు, రాజేశ్వరావు, ఇతర డీఆర్‌ఓలు, ఎఫ్‌ఎస్‌ఓ లు, ఎఫ్‌బీఓలు పాల్గొన్నారు.

ఘనంగా స్వయంపాలన దినోత్సవం



ఉపాధ్యాయులతో విద్యార్థులు

రేగొండ : స్థానిక వాణివిద్యానికేతన్‌లో శనివారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. సుమారు 60 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. జిల్లా విద్యాధికారిగా వైష్ణవి, మండల విద్యాధికారిగా మణికంఠ, ప్రిన్సిపాల్‌గా జయంత్, వైస్ ప్రిన్సిపాల్‌గా హర్షిత, ఉపాధ్యాయులుగా మిగతా విద్యార్థులు వ్యవహరించి వారి అనుభవాలను పంచుకున్నారు. ముఖ్యఅతిథిగా మండల వైద్యాధికారి హిమబిందు హాజరై ఆరోగ్యానికి తీసుకోవాల్సిన ఆహారపు అలవాట్లను వివరించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సర్వు రజిన్ కుమార్, ఉపాధ్యాయులు రమేష్, రాజు, రవీందర్, తిరుపతి, మాలతి, చైతన్య, ఉజ్వల, శశాంక, శిరోమణి పాల్గొన్నారు.

ఎస్‌ఎస్‌తాడ్వాయి: మండలంలోని కాటాపూర్‌లో జెడ్పీ పాఠశాలలోని విద్యార్థులు స్వయంపాలన దినోత్సవాన్ని శనివారం ఘనంగా జరుపుకున్నారు. హెచ్‌ఎం సుధాకర్ ఆధ్వర్యంలో స్వయం పాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులు భూక్య సక్రునా యక్, ఎండీ అక్బర్ పాషా, జీవన్‌లాల్, సమ్మయ్య, పాపారావు, వెంకటేశ్వర్లు శ్యాంసన్, విజయ, శ్రీదేవి ఉషం మోహన్ పాల్గొన్నారు.

అడవి పందుల దాడిలో పంట ధ్వంసం

- ఆదుకోవాలని రైతు వేడుకోలు



అడవి పందులు ధ్వంసం చేసిన మొక్కజొన్న పంట

ములుగు రూరల్: అడవి పందుల దాటికి మొక్కజొన్న పంట ధ్వంసమైన సంఘటన మండలంలోని పొట్లాపూర్‌లో చోటు చేసుకుంది. బాధిత రైతు పాలడుగుల సమ్మయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నా యి. సమ్మయ్య తనకున్న ఆరు ఎకరాల భూమిలో వర్షాకాలంలో వరిసాగు చేయగా పంట పొట్టదశలో అడవి పందులు నాశం చేశాయని తెలిపారు. యా సంగి సాగులో మొక్క జొన్నసాగు చేయగా అడవి పందులు ధ్వంసం చేయడంతో చేను మొత్తం నేలవాలిందని వాపోయాడు. సుమారు ఏడాది సాగులో రూ.6 లక్షల మేర నష్టం వాటిల్లిందని అన్నారు. సా గు చేసిన పంటలను కాపాడుకుందాం అంటే కరెంటు పెడితే పోలీసులు, ఉచ్చులు పెడితే అటవీశాఖ అధికారులు కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తున్నారని తెలిపారు. అడవిపందుల కారణంగా పంటలు నష్టపోతున్నామని అధికారులకు తెలియపరిచినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో పంట పూర్తిగా నష్టపోయామని అన్నారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని బాధితుడు వేడుకుంటున్నాడు.